నిత్యాన్నదానానికి విరాళాల అందజేత

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారి దేవస్థానం శాశ్వత నిత్య అన్నదాన ట్రస్టుకు పలువురు అన్నదాతలుగా ఆదివారం విరాళాలు సమర్పించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు వడ్లమన్నాటి మిదిన్ శ్రీ సాయి మనోహర్ 14,400లు, రామకష్ణ 11,116, జై సూర్య ఆరాధ్య గీత 10,016, గుణపాటి సాయిబాబు శాంతిదంపతులు 10,116 విరాళంగా అందజేశారన్నారు. వారికి ఆలయ వేద పండితులు, అర్చక స్వాములు ఆశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటం మరియు ప్రసాదములు అందజేశారు. ఆలయానికి ఆదివారం దర్శనం టికెట్ ద్వారా రూ.1,12,335, మరియు నిత్యాన్నదాన ట్రస్ట్ కు రూ.47,137 మొత్తం రూ.1,59,472 ఆదాయం వచ్చిందని స్వామి వారిని 3,386 మంది దర్శనం చేసుకోగా 2,624 అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.

జలగల్లా వడ్డీ వ్యాపారులు

- చిరు వ్యాపారులు, రైతులే లక్ష్యం
- రూ.10 నుంచి రూ.20 వరకు వడ్డీ వసూలు
- సరికొత్త పద్ధతుల్లో వ్యాపారం
- ఉద్యోగుల నుంచి ఎటిఎం కార్డులు, చెక్కుల స్వీకరణతో అప్పులు

ప్రజాశక్తి - రాజోలు

జిల్లాలో అనాధికార వడ్డీ వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రజల అవసరాలను ఆసరా చేసుకొని కొందరు వ్యాపారులు అధిక వడ్డీలతో అమాయకుల నడ్డి విరుస్తున్నారు. ప్రధానంగా చిరువ్యాపారులు, ప్రయివేటు ఉద్యోగులు, ఒప్పంద కార్మికులనే లక్ష్యంగా ఈ నయా దందా సాగుతోంది. జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లు, కిరాణా దుకాణాలు, కూరగాయల మార్కెట్, టీ, టిఫిన్స్, పుట్పాత్తై వ్యాపారం చేస్తున్న వారికి అప్పులు ఇస్తూ దందా సాగిస్తున్నారు. వడ్డీ వ్యాపారుల దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. పోలీసులు పెద్దగా దృష్టి సారించకపోవడంతో వడ్డీ వ్యాపారులు చెలరేగిపోతున్నారు. జిల్లాలో రకరకాల పేర్లతో వడ్డీ వ్యాపారులు లావాదేవీలు సాగిస్తున్నారు. వారం వడ్డీ.. రూ.10 నుంచి రూ.20 వరకు వసూలు చేస్తున్నారు. ఎలాంటి పెట్టుబడి లేకుండా నాలుగు డబ్బులు ఉంటే చాలు వ్యాపారాన్ని మొదలు పెట్టేస్తున్నారు. ఎక్కువగా ఈ వ్యాపారంలో జిల్లా లోని వ్యాపారవేత్తలతో పాటు రాజకీయనాయకుల ప్రమేయం ఉండటం గమనార్హం. బినామీ పేర్లతో వ్యాపారాలు గుట్టుగా సాగిస్తున్నారు. చెక్, ప్రామిసరీ నోట్, వ్హైట్ పేపర్ల మీద సంతకాలు తీసుకుంటూ అడిగిన కాడికి అప్పులు ఇచ్చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఒప్పంద ఉద్యోగుల ఎటిఎం కార్డులను సైతం తనఖా పెట్టుకొని అప్పులు ఇస్తున్న పరిస్థితులు ఉంటున్నాయి.

అవసరాలే ఆసరాగా

రైతులు, కౌలు రైతులు పంటల పెట్టుబడుల కోసం అల్లాడిపోతున్నారు. సకాలంలో బ్యాంకుల నుంచి పంట రుణాలు అందడం లేదు. దీంతో వారికి మరో దారి లేక వడ్డీ వ్యాపారుల వద్దకు పరుగులు పెడుతున్నారు. జిల్లాలో చిన్నవి.. పెద్దవి కలిపి అనుమతులు పొందినవి, పొందనివి 200లకు పైగా ఫైనాన్స్‌లు ఉన్నాయి. వీరంతా రూ.100కు రూ.3 నుంచి రూ.10 వరకు వడ్డీ వసూలు చేస్తున్నారని బాధితుల ద్వారా తెలుస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో తమ వద్దకు వచ్చిన రైతులకు చెందిన భూముల పత్రాలను తాకట్టు పెట్టుకుంటున్నారు. ఖాళీ బాండ్ పేపర్ల మీద రైతులతో పాటు వారి కుటుంబ సభ్యుల సంతకాలు చేయించుకుని అప్పులు ఇస్తున్నారు. అనుమతి లేకుండా దర్జాగా ఆఫీసులను ఏర్పాటు చేసుకుని తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. రైతులకు ఇచ్చే అప్పుల్లో ముందుగానే వడ్డీలను పట్టుకుని మిగతా డబ్బులు చెల్లిస్తున్నారు. రైతులు పంటలు పండగానే మొత్తం డబ్బులను ఒకేసారి కట్టాల్సి ఉంటుంది. ఏ మాత్రం ఆలస్యమైనా ఇచ్చిన డబ్బులకు మళ్లీ వడ్డీ వసూలు చేస్తున్నారు.

ఉపాధిగా మారుతూ

వడ్డీ వ్యాపారం కొందరికి ఉపాధిగా మారుతోంది. ఎలాంటి పన్నులు చెల్లించకుండా, ఎటువంటి ఖర్చు లేకుండా ఇంటి నుంచే యథేచ్ఛగా ఈ దందాను సాగిస్తున్నారు. జిల్లా కేంద్రంలోనే వడ్డీ వ్యాపారం చేసేవారు దాదాపుగా 200 మందికి పైగా ఉంటారని తెలుస్తోంది. కొందరు వ్యాపారులు గ్రూపుగా ఏర్పడి రూ.10 లక్షల నుంచి రూ.కోటి వరకు వ్యాపారం సాగిస్తున్నారు.

దందా సాగుతుందిలా

చిరువ్యాపారులే లక్ష్యంగా వడ్డీ వ్యాపారం దందా సాగుతోంది. జిల్లాలోని పలు చిన్న హోటళ్లు, కిరాణ దుకాణాలు, కూరగాయల మార్కెట్లోని చిరువర్తకులు, టీ, టిఫిన్స్, పుట్పాత్లపై వ్యాపారం చేస్తున్న వారికి అప్పులు ఇస్తూ దందా సాగిస్తున్నారు. ప్రామిసరీ నోటీసుపై ఎలాంటి వివరాలు నమోదు చేయకుండానే రెవెన్యూ స్టాంపుపై సంతకాలు తీసుకుంటున్నారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందుగానే బలమైన జామీను తీసుకొని అప్పు చెల్లించేలా తరచూ ఒత్తిడి తెస్తున్నారు. కొన్ని సార్లు అప్పు వసూలు చేసే సమయంలో గొడవలకు దారితీసిన సందర్భాలున్నాయి. ఇలాంటి వడ్డీ వ్యాపారుల వల్ల అమాయకులు ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ వివాదాలు స్టేషన్ల వరకు వెళ్లినా పోలీసులను తమ ఆర్థిక పరపతితో తమ వైపు తిప్పుకొని ముక్కుపిండి మరీ వసూళ్లకు ఎగబడుతున్నారు.

మండల కేంద్రాల్లోనూ జోరుగా:

ముఖ్యంగా జిల్లాలో అమలాపురం,రావులపాలెం పట్టణాలతో వంటి వాణిజ్య కేంద్రంలో, ముమ్మిడివరం, రామచంద్రపురం, మండపేట, పి.గన్నవరం, రాజోలు, మల్కిపురం, అయినవిల్లి, కాట్రేనికోన మండలాల్లో జోరుగా వడ్డీ వ్యాపారం నడుస్తున్నట్లు సమాచారం.

పట్టించుకోని పోలీసు యంత్రాంగం

నిత్యం జిల్లాలో రూ.కోట్ల వడ్డీవ్యాపారం జరుగుతున్నా పోలీసులు మాత్రం పట్టించుకోకపోవడంతో వడ్డీ వ్యాపారుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. అయితే ఈ దిశగా పోలీసులు దృష్టి సారించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

మలికిపురం సెంటర్ మరియు ఆయా పరిసరాలు, హోటళ్లు, చిరు వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. వీరికి రోజు వారీగా అప్పులు ఇవ్వడం, వాటిపై అధిక మొత్తంలో వసూలు చేయడం జరుగుతోంది. రాజోలు మండలంలో చిన్న మధ్య తరగతి ఆసాములు పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తుంటారు. వీరు బంగారం, ఇంటి స్థలాలను తనఖా పెట్టి అప్పులు చేస్తుంటారు. వ్యాపారం సజావుగా సాగి సమయానికి డబ్బులు ఇస్తే పర్వాలేదు.ఆలస్యమైతే వీరికి వడ్డీల బాదుడు తప్పదు. రాజోలు పోలీసు సబ్ డివిజన్ల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లేవారికి వీసాలు, అప్పులు ఇప్పించే దందా జోరుగా సాగుతోంది. అక్కడికి వెళ్లాక పనిలో చేరి డబ్బులు సకాలంలో చెల్లిస్తే ఫర్వాలేదు. లేకుంటే వడ్డీల బాదుడు తప్పదు.

రాజోలులో నివాసముంటున్న ఒక వ్యక్తి వడ్డీ వ్యాపారస్తుని అవతారమెత్తాడు. ఉద్యోగులకు రూ.10 నుంచి రూ.20ల వరకు వడ్డీతో అప్పులు ఇస్తున్నాడు. వారి నుంచి పూచీకత్తుగా ఎటిఎంలు, ఖాళీ చెక్కులను తీసుకోవడం ఈయన ప్రత్యేకత. ఎక్కడైనా తేడా వస్తే కోర్టుకు లాగుతుంటాడు. ఖాళీ చెక్కులు తీసుకోవడంతో రూ.లక్ష బాకీ ఉన్నా రూ.5 లక్షలకు కోర్టులో కేసు వేస్తానంటూ తన పబ్బం గడుపు కుంటున్నాడు.

అమలాపురంలో నిర్వహిస్తున్న యువకులకు అమలాపురం చెందిన ఓ వడ్డీ వ్యాపారి రూ.1.50లక్షలు అప్పుగా ఇచ్చాడు. ఇప్పటి వరకు ఆ యువకులు వడ్డీతో కలిపి రూ.3 లక్షలకు పైగా చెల్లించారు. తనకు ఇంకా రూ.లక్ష రావాలని, కట్టకపోతే క్యాంటీన్ మూసేయిస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడు.

లైసెన్సులు లేకుంటే చర్యలు

ఎవరైనా లైసెన్సు లేకుండా ఫైనాన్స్ నిర్వహిస్తున్నట్లు మా దష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అంతేకాకుండా అధికవడ్డీలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కేసులు నమోదు చేస్తాం. ఫైనాన్స్ నిర్వహించేందుకు నిబంధనల ప్రకారం తప్పనిసరిగా అనుమతులు కలిగి ఉండాలి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తక్షణమే వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేస్తాం.

-నరేష్ కుమార్, సిఐ, రాజోలు

చెకుముకి సైన్సు సంబరాలపై సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి - అమలాపురం సిటీ

జనవిజ్ఞాన వేదిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శివర్గ సమావేశం అమలాపురం ఎంప్లాయిస్ హోమ్‌లో జనిపల్లి సత్యనారాయణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ నెల 27 న జరిగే జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల నిర్వహణను సెక్రటేరియట్ సమీక్షించింది. మొదట జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.ఖాజా మొహిద్దిన్ సంబరాల వేదికను నిర్ణయించాలని కోరారు. జిల్లా కార్యదర్శి, మలికిపురం వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ అధినేత పి వి.వి.వరప్రసాద్ మలికిపురం డిగ్రీ కళాశాలలో జరుపుతామని స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆయనకు సమావేశం అభినందనలు తెలిపింది. జిల్లాలో మండల పట్టణ శాఖలు 26 నుండి 52 టీముల విద్యార్థులు హాజరవుతారన్నారు. పేరెంట్స్, టీచర్లు, అతిథులు, అభిమానులు 250 మందికి ఏర్పాట్లు, సైన్సు సంబరాల్లో భాగంగా ప్రాక్టికల్, డిస్ప్లే రౌండ్లు, రాత పరీక్షలకు ఏర్పాట్లు గురించి నిర్వాహకులు, కార్యదర్శి వర్గం చర్చించి సమీక్షించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెవివి.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కోలా వెంకటేశ్వరరావు, జిల్లా భౌతికశాస్త్రం విషయ నిపుణుడు అభిరెడ్డి వెంకట రామకృష్ణ, కోశాధికారి జి.త్రినాథరావు, ఆడిట్ కమిటీ బిఎన్.వెంకటేశ్వరరావు, మలికిపురం సాంస్కృతిక కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎన్.రమేష్ తదితరులు పాల్గొన్నారు. త్రినాథ్ కుమార్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

తాటిపాకలో సినీ నటి డింపుల్ సందడి

కెఎస్ఆర్ మాల్ ప్రారంభ కార్యక్రమంలో నటి డింపుల్

ప్రజాశక్తి - రాజోలు

తాటిపాకలో ఏర్పాటు చేసిన కాంచీపురం వారి కెఎస్ఆర్ మాల్ ను సినీనటి డింపుల్ హాయతి ఆదివారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. షోరూమ్ ను తాటిపాక ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అడబాల దొరబాబు, క్యాష్ కౌంటర్ ను కంచర్ల బాబి, మొదటి అంతస్తును లెక్కింశెట్టి రత్నబాబు, శారీస్ సెక్షన్ ను చిక్కం శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా డింపుల్ హాయతి మాట్లాడుతూ సజనాత్మక, నాణ్యత, నైపుణ్యంతో కూడిన వస్త్రాలను కెఎస్ఆర్ మాల్ కోనసీమ ప్రాంతంలో తాటిపాకలో ప్రారంభించడం ఇక్కడి ప్రాంత ప్రజల అదృష్టం అని అన్నారు.సామాన్య ప్రజలకు సహితం అందుబాటులో ఉండేలా ధరలను నిర్ణయించారని ఆమె అన్నారు. ఆంధ్రప్రాంతం అంటే ఎంతో ఇష్టమని ఇక్కడి ప్రజలు తనపై ఎంతగానో ప్రేమాభిమానాలు చూపిస్తారని అన్నారు. ఈ సందర్భంగా ఆమె స్టేజ్ పై డ్యాన్స్ వేసి అభిమానులను అలరించారు. ఈకార్యక్రమంలో కెఎస్ఆర్ మాల్ వ్యవస్థాపకులు కె.సుబ్బరాజు, కె.సురేష్, రాజోలు ఎంపిపి కేతా శ్రీనివాస్, లెక్కింశెట్టి నానాజీ, లెక్కింశెట్టి బాబులు తదితరులు పాల్గొన్నారు.

427 'మద్యం' దరఖాస్తులు

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సయిజ్ సర్కిల్ పోలీసు స్టేషన్ పరిధిలోనున్న 20 మద్యం దుకాణాలకు తుది గడువు ముగిసే సమయానికి 427 దరఖాస్తులు అందాయని ఎక్సయిజ్ సిఐ ఐడి.నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. తొలి గడువు అయిన ఈనెల 9 నాటికి 300 దరఖాస్తులు రాగా, రెండు రోజుల గడువు పొడిగింపుతో మరో 127 ధరఖాస్తులు వచ్చాయన్నారు. దీంతో కేవలం దరఖాస్తు ఫీజు ద్వారానే స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో రూ. 8.54 కోట్లు ఆదాయం లభించిందన్నారు. రెండు రోజుల గడువు పొడిగింపు ద్వారా రూ. 2.54 కోట్లు అధనంగా ఆదాయం లభించిందన్నారు.

నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాస్

జనసేన ఐటి విభాగం కో ఆర్డినేటర్‌గా శ్రీనివాస్

ప్రజాశక్తి - మామిడికుదురు

మండలం (7గ్రామాలు) రాజోలు నియోజకవర్గం జనసేన పార్టీ ఐటీ విభాగం కోఆర్డినేటర్‌గా మగటపల్లికి చెందిన చింతక్రింద శ్రీనివాస్ నియమిస్తూ ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ ఆదివారం నియామక పత్రం అందజేశారు. మలికిపురం ఎల్ఎస్ ల్యాండ్ మార్క్‌లో నిర్వహించిన జనసేన పార్టీ ఐటీ కోఆర్డినేటర్ల నియామక కార్యక్రమంలో రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ చేతుల మీదుగా శ్రీనివాస్ నియామ కపత్రం అందుకున్నారు. మామిడికుదురు మండల ఉపాధ్యక్షుడు దొడ్డ జయరాం తదితరులు శ్రీనివాస్ కి అభినందనలు తెలియజేశారు.

నేడు జిల్లా స్థాయి 'పిజిఆర్ఎస్' రద్దు

ప్రజాశక్తి - అమలాపురంసిటీ

జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజి ఆర్ఎస్) కార్య క్రమం ఈ నెల 14న సోమవారం రద్దు చేశామని కలెక్టర్ కార్యాలయ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే డివిజన్, మండల, స్థాయిల్లో పిజిఆర్ఎస్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలు యథావిధిగా నిర్వహిస్తారని వారు తెలిపారు.

కార్టూ'నిజం'



ప్రొఫెసర్ సాయిబాబా మృతికి నివాళి

ప్రజాశక్తి - అమలాపురంసిటీ

స్థానిక గడియార స్తంభం సెంటర్ లో పౌర హక్కుల సంఘం ఆధ్వర్యంలో వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు ఢిల్లీ యూనివర్శిటీ ప్రొఫెసర్ గోకరకొండ నాగ సాయిబాబా సాయిబాబా మృతి ఆదివారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అమలాపురం నల్లమిల్లి గ్రామానికి చెందిన 90 శాతం వికలాంగుడైన సాయిబాబా అంతర్జాతీయ సదస్సులలో ప్రభుత్వాల తరఫున ప్రతినిధిగా పాల్గొన్నారని అన్నారు. అటు వంటి వ్యక్తిని బిజెపి ప్రభుత్వం రాజ ద్రోహం కేసులో దేశ ద్రోహిగా చిత్రీకరించి పది సంవత్సరాలు కఠిన జైలు జీవితాన్ని గడిపేలా చేసిందన్నారు. అయితే గత మార్చి నెలలో సుప్రీంకోర్టు నిరపరాధిగా ఆయనను విడుదల చేసిందన్నారు. అయితే అప్పటికే పూర్తిగా ఆరోగ్యం క్షీణించిన సాయిబాబా విడుదలై కోలుకోలేని స్థితిలో నిమ్స్ ఆసుపత్రిలో ఈ నెల 12న తుది శ్వాస విడిచారన్నారు. ఇది ప్రభుత్వం చేసిన హత్య గానే పౌరహక్కుల సంఘం భావిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకులు జిల్లెల్ల మనోహర్,

నివాళులు అర్పిస్తున్న వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు

అమలదాసు బాబురావు, చెల్లింగి త్రిమూర్తులు మానవ హక్కుల వేదికకు చెందిన మహమ్మద్ ఇక్బాల్, ఏ. రవి, ఏడిద రాజేష్, నామాడి శ్రీధర్ సిపిఐ కు చెందిన కె..సత్తిబాబు, సిపిఎం శ్రీనివాస్, రైతు కూలీ సంఘం మచ్చ నాగయ్య, పి డి ఎస్ యు ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా మృతి పట్ల వికలాంగుల మహా సంఘటన్ మాజీ అధికార ప్రతినిధి నిమ్మకాయల సురేష్ సాయిబాబా మతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నామన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా మృతి తీరనిలోటన్నారు.

అమలాపురం రూరల్: ప్రొఫెసర్ సాయిబాబా మృతికి పలువురు ప్రజా సంఘాల నాయకులు నివాళు లర్పించారు.

ఘనంగా 'తోరాటి' జయంతి

అంగర లో సీనియర్ సిటిజన్‌కు సత్కారం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలు తోరాటి లక్ష్మణమూర్తి 98వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్యం అనంతరం పేదలకు భూములు పంచాలంటూ తెలంగాణలో సాగిన సాయుధ పోరాటంలో అంగరకు చెందిన తోరాటి లక్ష్మణమూర్తి పాల్గొన్నారు. అక్కడ పోలీసుల కాల్పుల్లో వీరమరణం పొందారు. అప్పటి నుంచి గ్రామంలో లక్ష్మణమూర్తి జయంతిని రెండు గ్రామాల ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. ఆదివారం స్థానిక తోరాటి లక్ష్మణమూర్తి విజ్ఞాన కేంద్రం వద్ద అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళి అర్పించారు. అంగర, పడమర ఖండ్రిక, గ్రామాల సర్పంచ్లు వాసా కోటేశ్వరావు, తిరునాటి ఆదిలక్ష్మి, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, విజ్ఞాన కేంద్రం నిర్వాహక కమిటీ నాయకులు పెద్దింశెట్టి లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. అంగర గాంధీ సెంటర్లోని లక్ష్మణమూర్తి విగ్రహం వద్ద నివాళి అర్పించారు. సీనియర్ సిటిజన్ సంకాబత్తుల ఎర్రబ్బులును ఘనంగా సత్కరించారు. రెండు గ్రామాల ప్రజా సంఘాల నాయకులు జిత్తుక మల్లిఖార్జునుడు, ముత్తా అబ్బు,, పసలపూడి కష్ణ, పడాల రాంబాబు, చీకట్ల గంగరాజు, ముత్తా త్రిమూర్తులు, యానాల సుబ్బారావు, ఆటో యూనియన్మా నాయకులు మాట్లాడుతూ లక్ష్మణమూర్తి అంగర గ్రామానికి చెందినవారు కావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో రెండు గ్రామాల ప్రముఖులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఎంఎల్ఎ ఆనందరావు

ఘనంగా లక్ష్మీనారాయణ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

మాజీ జెడ్పిటిసి సభ్యుడు ,రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు,రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేశంశెట్టి వెంకట లక్ష్మీనారాయణ పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. భీమనపల్లిలోని లక్ష్మీనారాయణ స్వగహం వద్ద జరిగిన పుట్టినరోజు వేడుకల్లో ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు పాల్గొని లక్ష్మీనారాయణ, ఎంపిటిసి సభ్యురాలు నాగరత్నకుమారి దంపతులకు దుశ్శాలువా కప్పి పూలమాలతో సత్కరించి పుట్టినరోజు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు నిమ్మకాయల సూరిబాబు, నాయకులు ఆకేటి బాబులు, గుత్తుల నాగేశ్వరరావు, కంకటాల రామం, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, రవణం మధు, గొలకోటి చిన్న, పెయ్యల దుర్గారావు, మంచెం బాబి, చీకట్ల సత్తిబాబు, యాళ్ళ సత్తిబాబు, చీకట్ల ఏసుబాబు, కేటి పెద్ద, చిక్కం ఉమేష్, చీకట్ల నాని కూటమి నాయకులు, అభిమానులు పాల్గొని లక్ష్మీనారాయణకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

నేత కళాకారునికి అభినందన

పార్టీ గుర్తుల వస్త్రాలను ఆవిష్కరించిన ఎంఎల్ఎ వేగుళ్ల

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

నేలటూరు గ్రామానికి చెందిన చేనేత కళాకారుడు రుద్రాక్షుల పుల్లాజీ తన చేనేత మగ్గంతో తయారు చేసిన టిడిపి, జనసేన పార్టీ గుర్తులను వస్త్రాలను ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండపేట టిడిపి కార్యాలయంలో చేనేత కళాకారుడు పుల్లాజీని ఎంఎల్ఎ వేగుళ్ళ అభినందించారు. కార్యక్రమంలో నేలటూరు టిడిపి గ్రామాధ్యక్షులు రుద్రాక్షుల సోమేష్, సిద్ధాని సుబ్రహ్మణ్యం, రుద్రాక్షుల వెంకట గణేష్, అల్లం శ్రీను, చల్లా సుబ్రహ్మణ్యం, మండపేట చేనేత సొసైటీ సెక్రటరీ గణపతి, మండపేట వార్డు కౌన్సిలర్ కాశిన కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి ఆలమూరులో పల్లె పండుగ

ప్రజాశక్తి - ఆలమూరు

మండల పరిధిలో ఈ నెల 17 నుంచి పల్లె పండుగ కార్యక్రమాలు జరుగుతాయని, దీనికి ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని ఎంపిడిఒ కె.జాన్ లింకన్, ఇంచార్జ్ డిఎల్పిఒ, స్థానిక ఇఒపిఆర్‌డి ఐదం రాజు ఆదివారం తెలిపారు. 17న మడికి, బడుగువానిలంక, చొప్పెల్ల, చెముడులంక, మూల స్థానంలలో పల్లె పండుగ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 20న సంధి పూడి, పినపల్ల, పెదపల్ల, గుమ్మిలేరు, పెనికేరు, ఆల మూరుల్లో పల్లె పండుగ కార్యక్ర మాలు జరుగుతాయన్నారు. పై గ్రామా ల్లో అభివృద్ధిలో భాగంగా ఎంజిఎన్ ఆర్ఇజిఎస్ నిధులతో పనులు ప్రారం భిస్తారని తెలిపారు. వారి వెంట మం డల పరిషత్ ఎఒ మెహర్ ప్రకాష్ ఉన్నారు.

వేలం నిర్వహిస్తారా.. వాయిదా వేస్తారా..

ప్రజాశక్తి-రామచంద్రపురం

కోటిపల్లి నుంచి ముక్తేశ్వరం ఫెర్రీ రేవు బహిరంగ వేలం ఏడు నెలలుగా వాయిదా పడుతూ వస్తోంది. అసలు బహిరంగ వేలం జరుగుతుందా లేదో తెలియని పరిస్థితి నెలకొంది. మార్చి 2023లో రేవుకు బహిరంగ వేలం జరగవలసి ఉండగా అప్పటి మంత్రి స్థానికులతో కుమ్మక్కై రేవు పాటకు ఎవరు హాజరు కాకుండా చూడడంతో పాట వాయిదా పడింది. దీంతో కోటిపల్లికి చెందిన రేవు నిర్వాహకులు బిక్కిన దుర్గారావు వెంకటేశ్వర ఆల్‌కాస్ట్ సొసైటీ పేరుతో ప్రతినెలా రూ.6 లక్షలు కె.గంగవరం మండల పరిషత్తుకు చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే జూలై నుంచి వరదలు రావడంతో కోటిపల్లి రేవును మూసివేసి ప్రయాణాలు నిలిపివేశారు.

ప్రస్తుతం వరదలు తగ్గినా

ప్రస్తుతం గోదావరి వరదలు తగ్గినా ప్రయాణాలు పునరుద్ధరించలేదు. దీంతో మిగిలిన 6 నెలలు కాలానికి అంటే మార్చి వరకు బహిరంగ వేలం నిర్వహిస్తారని మండల పరిషత్తు అధికారులు దీనిపై బహిరంగ వేలానికి తేదీని ప్రకటించారు. అయితే వేలంలో పాల్గొనే వ్యక్తులు కనీసం నిర్వహణలో ఐదేళ్లపాటు అనుభవం ఉండాలన్న నిబంధన వల్ల బహిరంగవేలానికి ఎవరు ముందుకు రావడంలేదని దీన్ని సవరించాలని పలువురు కోరడంతో జిల్లా కలెక్టర్ సెప్టెంబర్ లో జరగాల్సిన బహిరంగ వేలం వాయిదా వేశారు. దీనిపై పిఆర్ కమిషనర్‌ను ఈ నిబంధన సడలించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ లేఖ రాశారని దీనిపై క్లారిటీ వచ్చిన తర్వాత వేలం నిర్వహిస్తారని మండల అధికారులు తెలిపారు. ప్రస్తుతం గోదావరికి వరదనీరు తగ్గడంతో రేవు ప్రయాణాలు పునరుద్ధరించాల్సి ఉంది. అక్టోబర్ నుంచి ఏప్రిల్ వరకు పెళ్లిళ్ల సీజన్

కోటిపల్లి గోదావరి రేవు

ఉండటంవల్ల కోటిపల్లి ముక్తేశ్వరం రేవు నుండి పెద్ద ఎత్తున ప్రయాణికులు అమలాపురం చేరుకుంటారు దీంతో వెంటనే రేవును పునరుద్ధరించాలని జిల్లావాసులు కోరుతున్నారు. కాకినాడ నుంచి అమలాపురం వెళ్లే ప్రయాణికులకు కోటిపల్లి మీదుగా వెళితే 20 కిలోమీటర్లు దూరం కలిసి వస్తుంది. దీంతో కాకినాడ నుండి ద్రాక్షారామ రామచంద్రపురం తదితర ప్రాంతాలు వాసులకు కోటిపల్లి మీదగా అమలాపురం వెళ్లేందుకు దగ్గర కావడంతో ఈ మార్గంలో ఎక్కువ ప్రయాణిస్తారు. దీనివల్ల డబ్బుతో పాటు సమయం ఆదా అవుతుంది. ప్రతి ఏటా ఈ రేవు పాట ద్వారా సుమారు రూ.70 లక్షల ఆదాయం సమకూరుతుంది. వెంటనే కోటిపల్లిలో రేవు లో ప్రయాణాలు పునరుద్ధరించాలని పరిసర ప్రాంత ప్రజలు జిల్లా వాసులు అధికారులను కోరుతున్నారు.



నడిపూడిలో అనంతలక్ష్మి,చంటి దంపతులను సన్మానిస్తున్న సర్పంచ్, గ్రామప్రజలు

నడిపూడి గ్రామ కార్యదర్శికి సన్మానం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

స్వచ్ఛతాహీ సేవ పురస్కార గ్రహీత నడిపూడి కార్యదర్శి అనంతలక్ష్మికి గ్రామ ప్రజలు అభినందనలు ఆదివారం ఘనంగా సన్మానించారు. మండలంలో పరిశుభ్రత గ్రామంగా నడిపూడి గ్రామాన్ని గుర్తిస్తూ అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా స్వచ్ఛతాహీ సేవ -2024 అవార్డును ఎంపీ, ఎంఎల్ఎ, కలెక్టర్ చేతుల మీదుగా నడిపూడి గ్రామ కార్యదర్శి అనంతలక్ష్మి అందుకున్నారు. ఈ సందర్భంగా నడిపూడి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ ప్రజలు అందరూ కలసి కార్యదర్శికి సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం నడిపూడి సర్పంచ్ చెల్లుబోయిన నాని ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి పనిచేస్తున్న మొదటి మహిళా కార్యదర్శి కావడం విశేషం అన్నారు. తమ గ్రామానికి గుర్తింపు తెచ్చే విధంగా పనిచేస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. గ్రామాన్ని మరింత అబివృద్ధి చేసే విధంగా మరిన్ని పనులు చేసి గ్రామానికి మరింత గుర్తింపు తీసుకురావాలని అన్నారు. గ్రామ ప్రజలు అందరూ కలిసి సెక్రెటరీ అనంతలక్ష్మి, చంటి దంపతులను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రంకిరెడ్డి సాంబ స్వామి, మాజీ జెడ్పిటిసి సభ్యుడు అధికారి బాబ్జి విజయలక్ష్మి , మాజీ ఎఎంసి ఛైర్మన్ బి.అదినారాయణ, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసి సభ్యులు, వార్డు సభ్యులు, సచివాలయం సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ప్రజాశక్తి - సామర్లకోట, తాళ్లరేవు

మండలంలోని మాదవపట్నం - వికె.రాయపురం మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. ఆదివారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలు ఇలావున్నాయి..తాళ్లరేవు మండలం జార్జ్‌పేట నుంచి పెద్దాపురం బైక్‌పై భార్య, భర్తలు ఇద్దరూ వెళ్తుండగా రోడ్డు మధ్యలో ఉన్న గుంతలో ప్రమాదవశాత్తు తూలి రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో దొంతన ఆదిలక్ష్మి (60)కి తలకు బలమైన గాయం అయి అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదంపై సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తాళ్లరేవు మండలం జార్జి పేట గ్రామానికి చెందిన దొంతన ఆదిలక్ష్మి(60) మృతితో ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

పొలం తగాదాలో దాడిపై కేసు

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ఉప్పంపాలెం గ్రామంలో పొలం పని చేసుకుంటున్న కాకినాడ రూరల్ తూరంగి గ్రామానికి చెందిన వేగిశెట్టి సూర్యప్రకాష్‌పై రౌతుల పూడి గ్రామానికి చెందిన లింగం గంగాధర్, ఉప్పం పాలెం గ్రామానికి చెందిన బచ్చ ఎర్రయ్యలు పొలం మాదని కత్తితో దాడికి దిగారు. ఈ మేరకు వేగిశెట్టి సూర్యప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 22 మందిపై కేసులు

ప్రజాశక్తి - తాళ్లరేవు రూరల్

మండల పరిధిలోని జార్జిపేట వై-జంక్షన్ చెక్ పోస్ట్ వద్ద ఆదివారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 22 మందిపై కేసులు నమోదు చేసినట్లు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. జాతీయ రహదారి 216 పై రోడ్డు ప్రమాదాలు నివారించాలనే లక్ష్యంతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు యానం నుంచి మద్యం సేవించి వస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మృతదేహంతో యజమాని ఇంటి వద్ద ఆందోళన

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని పవర గ్రామంలో ఒక ఇంటి యజమాని వద్ద కార్మికుని మృతదేహంతో కుటుంబీకులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలావున్నాయి..పవర శివారు ప్రాంతంలో ఈ నెల 5వ తేదీన సతీష్ అనే వ్యక్తికి చెందిన భవనానికి పెయింటింగ్ వర్క్ చేస్తుండగా ఇద్దరు కార్మికులు జారిపడి తీవ్రంగా గాయపడ్డారు. వారిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు కొమ్మ నాని (25) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. మృతుని కుటుంబానికి, గాయపడిన వ్యక్తికి భవన యజమాని న్యాయం చేయాలని బంధువులు, గ్రామస్తులు భవనం వద్ద మృతదేహంతో ఆందోళన చేపట్టారు. సంఘటనా స్థలానికి సిఐ ఎ.కృష్ణభగవాన్, ఎస్ఐ రమేష్‌బాబు సిబ్బందితో చేరుకుని భవన యజమాని కుటుంబంకులతో చర్చించారు. సాయంత్రం 6 గంటల వరకు చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. గాయపడిన వ్యక్తి కందికట్టు మహేంద్ర (25) పరిస్థితి బాగానే ఉందని సిఐ కృష్ణ భగవాన్ చెప్పారు. ఎట్టకేలకు ఆందోళనకారులకు, భవన యజమానికి మధ్య ఒప్పందం కుదిరినట్లు తెలిసింది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి సామర్లకోట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన యువకునికి రిమాండ్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

నాలుగు సంవత్సరాల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి కొత్తపేట జెఎఫ్‌సిఎం న్యాయమూర్తి ఆదివారం 14 రోజులు రిమాండ్ విధించారు. పోలీసులు వివరాలు ప్రకారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన నాలుగు సంవత్సరాల బాలికను అదే గ్రామానికి చెందిన నల్లూరి శివ అనే యువకుడు ఈనెల 10న ఉదయం బాలికకు మాయమాటలు చెప్పి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బాలిక అమ్మమ్మకు చెప్పింది. ఆమె పోలీసులను శనివారం ఆశ్రయించింది. ఈ ఘటనపై శనివారం పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని ఆదివారం అరెస్ట్ చేసి కొత్తపేట కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి 14 రోజులు డిమాండ్ విధించాలని ఎస్ఐ ఎస్.రాము తెలిపాడు

బైకు ఢీకొని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - కాట్రేనికోన

మోటార్ సైకిల్ ఢీకొట్టిన ప్రమాదంలో కాట్రేనికోన మండలం పల్లం శివారు గోపాలరావు పేటకు చెందిన అయితాబత్తుల స్వామి(63) అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే ఆదివారం స్థానికంగా రోడ్డుపై నడిచి వెళ్తున్న స్వామిని వెనుక నుంచి మోటర్ సైకిల్ ఢీకొట్టడంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పల్లం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తప్ప తాగి మోటార్ సైకిల్ పై వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. ఈ మేరకు కాట్రేనికోన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - రావులపాలెం

గౌతమి వంతెన గోదావరి పైనుండి గోదావరి నదిలోకి దూకి ఒక మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం నడిపూడికి చెందిన వెన్నేటి రాజేశ్వరి గౌతమీ వంతెన పై నుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనిని గమనించిన జాలరి నావపై వెళ్లి మునిగిపోతున్న మహిళను కాపాడాడు. పోలీసులకు అందిన సమాచారం మేరకు హెడ్ కానిస్టేబుల్ నాయుడు ఘటనా స్థలానికి చేరుకుని ఆ మహిళను స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. పిల్లలు లేకపోవటంతో మనస్థాపానికి గురియై ఆత్మహత్య చేసుకోవడానికి పాల్పడినట్లు ఆమె తెలిపింది. ఆమెకు ఎస్ఐ చంటి కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులకి అప్పగించి స్వగ్రామానికి పంపించారు.

రహదారి చెంత పొగతో ఇబ్బందులు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలం లోని పలు గ్రామాల్లో ఊడ్చిన చెత్త ను రహదారి చెంతన పోయడం, పోసిన చెత్తకు నిప్పు పెట్టడంతో వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారి పై వెళ్లే ప్రయాణికులు, వాహనదారులకు ఈ పొగ కళ్లకు వ్యాపించడంతో ఒక్కోసారి ప్రమాదాలకు కారణమవుతోంది. ప్రతినిత్యం రహదారిపై వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో పొగతో ఇబ్బందులు పడుతున్నారు .మండలంలోని వల్లూరు ,టేకి, అంగర, పడమర కండ్రిక, తదితర గ్రామాల్లో డంపింగ్ యార్డ్‌లు కొరతతో చెత్తను రహదారి పక్కనే వేస్తున్నారు. దీంతో రోడ్డుపై ప్రయాణికులు రాకపోకలు సాగించాలంటే వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. కాలిన బూడిద గాలికి ఎగిరి కళ్ళల్లో పడుతుందని ప్రజలు వాపోతున్నారు. వెదురుమూడి వల్లూరు మురుగు కాలువ ప్రధాన రహదారి ప్రక్కన వేసిన ప్లాస్టిక్ వ్యర్థాలతో కూడిన చెత్తకు నిప్పు పెట్టడంతో ఈ పొగ రహదారిని కమ్మి దారి కనిపించక, పొగ వలన కళ్ళకు మంటలు వ్యాపించడంతో వ్యాహనదారులు ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి పక్కనే రైతులు పశువులకు గడ్డివాములు ఏర్పాటు చేసుకున్నారు. అయితే గాలి వీసే సమయంలో నిప్పు రవ్వ ఎగిరిపడి గడ్డి వాములపై పడితే, అగ్నికి ఆహుతి అయ్యే ప్రమాదం ఏర్పడుతుందని రహదారిపై వెళ్లే ప్రయాణికులు ఆందోళన చెందారు. ఎటువంటి ప్రమాదాలకు దారి తీయకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు ,వాహనదారులు కోరుతున్నారు.

అంగరలో రహదారిలో కమ్మిన పొగ

సీనియర్ పాత్రికేయుడు నూకరాజు మృతి

ప్రజాశక్తి - రౌతులపూడి, రామచంద్రపురం



సుర్ల నూకరాజు (ఫైల్)

రౌతులపూడికి చెందిన సీనియర్ పాత్రికేయుడు సుర్ల నూకరాజు (44) గుండెపోటుతో మృతి చెందారు. నూకరాజు పలు దినపత్రికల్లో విలేకరిగా పని చేశారు. ప్రస్తుతం రామచంద్రపురం నియోజవర్గంలో ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తూ దసరా పండుగ నిమిత్తం కుటుంబ సమేతంగా స్వగ్రామానికి విచ్చేశారు. శనివారం రాత్రి భోజనం అనంతరం రోజు వారీ వేసుకునే మందులను వేసుకుని నిద్రకు ఉపక్రమించారు. అదే సమయంలో కొద్దిగా నలతగా ఉందని అంతకు ముందుగానే కుటుంబ సభ్యులకు చెప్పారు. కొద్ది సమయం తరువాత కుటుంబ సభ్యులు ఆయనను లేపేందుకు ప్రయత్నిం చారు. కానీ ఆయన నుంచి స్పందన లేకపోవడంతో వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. నూకరాజు మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నూకరాజుకు భార్య, పిల్లలు ఉన్నారు. నూకరాజు మృతి పట్ల జర్నలిస్టులు ఎల్.వెంకటరమణ, కె.రాము, బి.శివప్రసాద్, ఎన్.రమేష్, చంటిబాబు సంతాపం వ్యక్తం చేశారు. అలాగే రామచంద్రపురం ప్రింట్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ దేవానందం, బి. వరప్రసాద్, జి రాయుడు, ప్రభాకర్, ఎలక్ట్రానిక్ మీడియా నాయకులు కె.కనక రత్నం, హరనాథ్, సుధీర్, పృథ్వి రాజు, త్రిమూర్తులు, రాధాకష్ణ, శ్రీనివాస్, సంతాపం తెలిపారు.

అంధకారంలో ద్రాక్షారామ పోలీస్ స్టేషన్

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ కరెంట్ లేని పక్షంలో అంధకారంలో కొనసాగుతోంది. పోలీస్ స్టేషన్లో ఇన్వెర్టర్ పని చేయకపోవడంతో గత ఐదారు నెలలుగా కరెంటు పోతే ఇక అంతే సంగతులు. స్టేషన్‌కు నియోజకవర్గం నలుమూలల నుండి ప్రజా సమస్యలపై పలువురు వస్తుంటారు. ఇటీవల కరెంటు కోతలు అధికం కావడంతో కరెంటు పోయిన ప్రతిసారి స్టేషన్ అంధకారంలోకి చేరుతోంది. ఇక సిబ్బంది కూడా చీకట్లో పని చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ నెల 12న దసరా ఉత్సవాల సందర్భంగా మొత్తం కరెంటు నిలుపుదల చేయడంతో స్టేషన్ మొత్తం అంధకారంలో ఉంది. స్టేషన్‌కు ఉన్న ఇన్వర్టర్ పాడైపోవడంతో తిరిగి దానిని పునరుద్ధరించలేదు. దీనివల్ల ప్రజలు, పోలీసులు, ఇక్కట్ల గురవుతున్నారు. వెంటనే స్టేషన్లో ఇన్వర్టర్ పునరుద్ధరించి పోలీస్ స్టేషన్కు నిరంతరం విద్యుత్ సరఫరా కొన సాగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు సిబ్బంది కోరుతున్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయురాలు శకుంతల మృతికి సంతాపం

ప్రజాశక్తి - రావులపాలెం

శకుంతల(ఫైల్)

రిటైర్డ్ ఉపాధ్యాయురాలు జాలాది శకుంతల(66) మృతికి ఆదివారం పలువురు సంతాపం తెలిపారు. ఆమె ఈ నెల 11న స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. శకుంతల రావులపాలెం మండలం పొడగట్లపల్లి నవజీవననగర్ లో సాధారణ రైతు కుటుంబానికి చెందిన జాలాది రత్నం, లక్ష్మీకాంతం కుమార్తె. ఈమె 15 జూన్ 1958లో జన్మించారు. సంస్కృత భాషలో ప్రావీణ్యం పొంది సంస్కృత ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకుని ఎందరినో ఉన్నత స్థాయికి తీసుకొచ్చారు. ఈమెకు భర్త కాకర నాగేశ్వరరావు, సోదరుడు జాలాది సుందర్‌లాల్, ఇద్దరు కుమా రులు కాకర మనోహర్, కాకర శ్రీకాంత్, కుమార్తె మాలతి, మను మలు, మనవరాంఢ్రు ఉన్నారు. ఈమె వృత్తి రీత్యా రావుల పాలెంలో నివాసం ఏర్పాటు చేసుకొని శేష జీవి తాన్ని కొనసాగించారు. శకుంతల మృతికి ఉపాధ్యాయ సంఘాలు, పూర్వ విద్యా ర్థులు, రాజకీయ నాయకులు, బంధు వులు సంతాపం తెలిపారు.

ఘనంగా బేతాళ సంబరం

ప్రజాశక్తి - సామర్లకోట

సంబరంలో పాల్గొన్న యాత్రికులు

వేట్లపాలెం గ్రామంలో గత పది రోజులుగా నిర్వహించిన బేతాళ స్వామి ఉత్సవాలు ముగింపు కార్యక్రమం ఆదివారం సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంబరంలో ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. బేతాళ స్వామిని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి, టిడిపి నాయకుడు బొడ్డు వెంకటరమణ చౌదరి, నాయకులు గుణ్ణం చంద్రమౌళి, ఇతర కూటమి నాయకులు దర్శించుకున్నారు. గ్రామ పురవీధుల గుండా బేతాళ స్వామిని ఊరేగించి గ్రామ శివారుకు తీసుకెళ్లారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సామర్లకోట సిఐ ఎ.కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

తప్పుడు ఆరోపణలు సరి కాదు

ప్రజాశక్తి - పిఠాపురం

వారు చేసిన తప్పులను తనపై నెట్టేయడం సమంజసం కాదని తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మలిరెడ్డి ఉపేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు టి.చెంగల్రాయనాయుడు, జనరల్ సెక్రటరీ జి.చక్రవర్తి చేసిన తప్పులను తనపై రుద్దుతున్నారని విమర్శంచారు. రామచంద్రాపురం పట్టణం నుంచి నకిలీ జనన ధృవపత్రాలతో క్రీడాకారులు, క్రీడాకారిణులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న మాట వాస్తవమేనని, క్రీడాకారులు సమర్పించిన జనన ధృవ పత్రాలు నకిలీవి అని అధికారులు సైతం ధృవీకరించారన్నారు. అర్హత లేని క్రీడాకారులను పోటీలకు పంపడంపై అర్హత గల క్రీడాకారుల తల్లితండ్రులు కోర్టును ఆశ్రయించారని, నకిలీ బర్త్ సర్టిఫికెట్స్ కేసు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో విచారణ జరుగుతున్న మాట నిజమా కాదా అని ప్రశ్నించారు. 2017 నుంచి 2019 వరకు తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, రాష్ట్ర జనరల్ సెక్రటరిగా కొనసాగిన చక్రవర్తి అప్పుడు బోగస్ సర్టిఫికెట్స్‌పై ఎందుకు నోరు మెదపలేదన్నారు. మీరు కోర్టు కేసులు లేవు పోలీస్ కేసులు లేవంటూ చెపుతున్నారని గతంలో అనేక తప్పులు,పొరపాట్లు జరిగాయని, కేసులు కూడా నమోదు అయ్యి విచారణ దశలో ఉన్నాయన్నారు. తనపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని, సాక్ష్యాలతో మీడియా ముందుకు తాను వస్తానని, మీరు గాని మీ అసోసియేషన్‌లో సభ్యులు గాని నిజంగా ఏ తప్పు చేయకపోతే బహిరంగ చర్చకు రావాలని ఆయన సవాల్ చేశారు.

25 ఏళ్లుగా రోడ్డు కోసం ఎదురుచూపు

- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- నడిచేందుకు కూడా వీలు లేని మెయిన్ రోడ్డు

ప్రజాశక్తి - రామచంద్రపురం

గత ఇరవై ఐదు ఏళ్లుగా రోడ్డు కోసం గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మరింత ఇక్కట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు పరిశీలిస్తే కె.గంగవరం మండలంలోని కుడుపూరు పంచాయతీ పరిధిలో గల వెదురు బియ్యం కొంపలు మీదుగా శివల వచ్చే మెయిన్ రోడ్డు పూర్తిగా పాడయింది. కొద్దిరోజులుగా కురిసిన వర్షాలకు ఈ రోడ్డుపై నడిచేందుకు కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 25 సంవత్సరాల క్రితం ఈ రోడ్డుకు అప్పటి ఎంఎల్ఎ పిల్లి సుభాష్ చంద్రబోస్ దీనికి కొంత గ్రావెల్ వేయించారని ఆ తర్వాత ఈ రోడ్డును పట్టించుకునే నాధుడే లేడని గ్రామస్తులు తెలిపారు. ఇక రైతులు పొలాలకు వెళ్లాలన్న రాత్రి సమయంలో ప్రయాణించాలంటే అవస్థలు తప్పడంలేదు. ఈ రోడ్డును వీలైనంత త్వరగా ఆధునికరించాలని ఎంతోమంది నాయకులు అధికారులు చుట్టూ తిరిగిన ఫలితం లేదని గ్రామస్తులు వివరించారు.

రోడ్డును ఆదునికీకరించాలి

ఈ రోడ్డు కోసం అందరూ చుట్టూ ప్రదక్షిణలు చేసిన ఫలితం లేదని తిరిగి తిరిగి ఏం చేయాలో పాలు పోక మిన్నుకున్నాము. శివల నుండి వెదురు బియ్యం కొంపలు మీదుగా కుడుపూరి వెళ్లే ఈ రహదారి సుమారు ఎనిమిది కిలోమీటర్లు ఉంటుందని ఎప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు దీనిపై స్పందించి ఈ రోడ్డును ఆధునికరించాలి. రాత్రి సమయంలో మరింత దుర్భరంగా ఉంటుంది. రహదారి భవన శాఖ అధికారి ఈ రోడ్డుపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇక్కడ పరిస్థితి చూస్తే తేటతెల్లమవుతుంది.

- పిల్లి రాంబాబు,గ్రామ సర్పంచ్

రోడ్డు దుస్థితి ఇలా..

గ్రామాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - మామిడికుదురు

గ్రామాభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎంఎల్ఎ డ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ ఈనెల 14 నుండి 20 వరకు పల్లె పండుగ పేరిట ప్రజా ప్రతినిధులు సమన్వయముతో భూమి పూజ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు పి. గన్నవరం నియోజకవర్గంలో 4 మండలాలలో ఉపాధి హామీ నిధులతో వివిధ గ్రామాల్లో రూ.11.24 కోట్లతో రోడడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా సిసి రోడ్ల నిర్మాణం చేపడుతు న్నామన్నారు. పి గన్నవరం మండలం నందు 20 గ్రామాల్లో 46 ప్రాంతాలో రూ.3 కోట్లతో, అయినవిల్లి మండలం 20 గ్రామాల్లో 59 ప్రాంతాలలో రూ.3.24 కోట్లతోతో, మామిడి కుదురు మండలం నందు 11 గ్రామాల్లో 39 ప్రాంతాల్లో రూ.2 కోట్లతో, అంబాజీ పేట మండలం నందు 17 గ్రామాల్లో 48 ప్రాంతాల్లో రూ.3 కోట్లతో సిసి రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలియజేశారు.. ఈ పనులకు 14, 18 వ తేదీ అయినవిల్లి మండలంలో, 16, 20వ తేదీ పి.గన్నవరం మండలం, 17వ తేదీ మామిడికుదురు, 15, 19వ తేదీ అంబాజీపేట మండలాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగముగా శంకుస్థాపన కార్యక్రమాలు చేపడతామని పి గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి ఆదివారం తెలియజేశారు.

ఇసుక కొరతతో అవస్థలు

ప్రజాశక్తి - రౌతులపూడి

ఇసుక కొరతతో మధ్యలోనే నిలిచిపోయిన నిర్మాణం

కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక హామీ అన్ని వర్గాల్లోనూ సంతోషం వ్యక్తం అయింది. అయితే ఆ హామీ అధికారంలోకి వచ్చి 4 నెలలు కావస్తున్నా అమలు కాకపోవడంపై కార్మికుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. పనుల్లేక కార్మికులు పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకుంది. మరోపక్క ఇసుక కొరతతో అవస్థలు తప్పడం లేదు. ఇసుక లభ్యత అంతంత మాత్రంగా ఉన్న చోట్ల పెరిగిన ధరలతో భవనాన్ని నిర్మించుకునే వారిపై తీవ్ర భారాన్ని మోపుతోంది. బయట దళారులు టన్నుకు మూడు రెట్లు చొప్పున వసూలు చేసి సొమ్ములు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలను చేపట్టి ఆ ధరకు కొనుగోలు చేయలేని వారు మధ్యలోనే ఇళ్లను నిలిపివేసిన పరిస్థితి నెలకుంది. ఇళ్లు నిర్మించుకోవాలనుకునే పేదలు, మధ్యతరగతి వర్గాలు ఉచిత ఇసుక కోసం ఎదురు చూస్తున్నారు. గ్రామాల్లో నిర్మాణ పనులు నత్తనడకన సాగడంతో కార్మికులకు పనులు దొరకని పరిస్థితి నెలకొంది. మండలంలోని బలరామపురం, రౌతులపూడి, గిడజం, ఎస్.అగ్రహారం, ములగపూడి తదితర గ్రామాల్లో నిర్మాణరంగంపై ఆధారపడి సుమారు 3,000 మంది వరకు కార్మికులు జీవిస్తున్నారు. వీరు గ్రామాల్లో పనులు లేకపోవడంతో పొట్టకూటి కోసం వలస వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడింది. ఉచిత ఇసుక మాటలు ప్రకటనకే పరిమితం కాక... పని ప్రదేశానికి ఇసుక చేరుకునేందుకు వేలాది రూపాయలు చెల్లించవలసి వస్తుంది. గతంలో టన్ను అన్ని ఖర్చులతో రూ.850 కు ప్రతిపాడు నియోజకవర్గానికి సరఫరా అయ్యేది. ప్రస్తుతం ఆ టన్ను రవాణా ఖరీదు రూ.1200పైనే ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. కార్మికులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కోటిపల్లి నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

డీజేలో గుండెపోటుతో యువకుడు మృతి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

దసరా ఉత్సవాల్లో డిజెలో ఒక యువకుడు గుండెపోటుతో మృతి చెందిన సంఘటన అమలాపురంలో శనివారం చోటు చేసుకుంది. శనివారం రాత్రి అమలాపురం కొంకాపల్లిలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో డీజే సౌండ్‌కు అమలాపురం మండలం బండారులంకకు చెందిన పప్పుల వినయ్ (23) అనే యువకుడు డాన్స్ చేస్తూ కుప్పకూలిపోయాడు. వెంటనే స్థానికులు ఆ యువకుడ్ని ఆసుపత్రికి తీసుకెళ్లినా అప్పటికే మరణించాడు. దసరా ఉత్సవాలకు తన స్వగ్రామం వచ్చి కొంకాపల్లి దసరా ఉత్సవాలు తిలకించేందుకు వెళ్లి ఊరేగింపులో మృతి చెందాడు. చిన్న వయసులోనే వినయ్ ప్రాణాలు కోల్పోవడంతో బండారులంక గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వినయ్ హైదరాబాద్‌లో ఒక ప్రయివేటు ఉద్యోగం చేస్తున్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గోకవరం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన గోకవరంలో ఆదివారం చోటు చేసుకుంది. విజయవాడకు చెందిన ఇద్దరు వ్యక్తులు మారేడుమిల్లి నుంచి రాజమండ్రి వైపు స్కూటీపై వస్తుండగా గోకవరం గ్రామ శివారున రాజమండ్రి నుండి రంపచోడవరం వైపుగా వెళుతున్న కారు స్కూటీని ఢీకొంది. స్కూటీపై ఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి వైద్యం నిమిత్తం వారిని 108లో ఆసుపత్రికి తరలించగా సంఘటన స్థలానికి చేరుకున్న గోకవరం పోలీసులు పరిశీలించగా స్కూటీలో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీనిపై విచారణ చేపట్టినట్టు గోకవరం పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - కడియం

వేమగిరి పాయిజన్ దాబా ఎదురుగా జాతీయ రహదారిపై కారు ఢీకొని 47 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని తీవ్రంగా గాయపడింది. ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కడియం పోలీసులు తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఆమె వివరాలు తెలిసినవారు కడియం పోలీసు స్టేషన్‌లో తెలపాలని అన్నారు.

బెల్ట్ షాపుపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలో ధర్మవరం గ్రామంలో కిరాణా జనరల్ స్టోర్‌లో మద్యం అమ్మకాలు సాగుతున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్ఐ టి.లక్ష్మీకాంతం దాడి చేశారు. ఈ దాడిలో వివిధ రకాల బ్రాండ్స్‌కు చెందిన 23 మద్యం బాటిల్స్‌ను ఎస్ఐ స్వాధీనం చేసుకున్నారు. కిరాణా షాపులో మద్యం బాటిల్స్ అమ్ముతున్న సదర వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమంగా అమ్ముతున్న బెల్ట్ షాపులపై నిఘా ఉంచామన్నారు. చట్టానికి వ్యతిరేకంగా ఎటువంటి కార్యక్రమాలు జరిపిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కనుమరుగవుతున్న మండువా లోగిళ్లు

ఆత్రేయపురంలో మండువా లోగిలి (ఇన్‌సెట్) లోపలి భాగంలో హాలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండువ లోగిళ్లు పేరు వినగానే గుర్తుకు వచ్చేది. ఉభయగోదావరి జిల్లాలు. గోదారోళ్ళ అనగానే ముందుగా గుర్తొచ్చేది ఆప్యాయతలు ,అనురాగాలు , మమకారాలు. మండువ లోగిళ్లు అనగానే మనకు గుర్తొచ్చేది పెద్ద పెంకుటిల్లు పాటి మట్టితో నిర్మిస్తారు వేసవికాలంలో కూడా ఈ మండువ లోగిళ్లలో ఎసి లేకుండానే చల్లగా ఉంటుంది . ఇందులో 10 కుటుంబాల వరకు ఉంటారు. ఇంటి చుట్టూరు గదులు మధ్యలో హాలు ఉంటుంది. సుమారు 30 మంది వరకు ఈ మండవ లోగిలిలో నివాసం ఉంటారు. 30 సెంట్లు స్థలంలో మండువా లోగిల్లు ఉంటాయి. ఎవరైనా పలకరించడానికి వెళితే వారిని చల్లని మజ్జిగ ఇచ్చి ఆప్యాయంగా పలకరిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో పూర్వకాలం సుమారు 150 సంవత్సరాలు క్రితం మందువా ఇల్లు ఎక్కువగా కట్టుకునేవారు ఇంటి మధ్యలో హాలు చుట్టూ గదులు పెరటిలో ఇంట్లో ఉన్న అందరికీ సరిపడా కూరగాయలను పండించుకునేవారు ఆ ఇల్లు ఎప్పుడు సంక్రాంతి పండగ వాతావరణాన్ని నెలకొని ఉండేవి. కానీ నేటికీ అవి కనుమరుగవుతున్నాయి. ఇప్పటి కుటుంబాలు కలిసి ఉండడానికి ఇష్టపడకపోవడం. మండువ లోగిళ్లు కొత్తవి కట్టాలంటే అతి ఖర్చుతో కూడినవి

సామాన్యులు కట్టలేని పరిస్థితి

కొంతమంది అయితే ఇంటి మీద మక్కువతో రిపేర్లు చేయిస్తూ కాపాడుకుంటున్నారు. పాటిమట్టి తో నిర్మించడంతో పాటు చిన్న పెంకు తో పైకప్పును నేస్తారు . అటక కూడా వెదురు వెదురు లేదా చెక్కతో తయారుచేసి దాని పన కూడా పాటి మట్టి వేయడంతో వేసవి వచ్చిందంటే చాలు ఎసి వేసినట్టుగా గదులు చల్లగా ఉంటాయి. ఈ ఇంటిలో నివాసం ఉండేవారు డాబాలలో ఉండడానికి ఇష్టపడరు. ఎత్తు అరుగులతో ఎంతో ఆహ్లాదంగా ఉండే ఇళ్లను సైతం చూసి సినీ దర్శకులు మంత్రముగ్ధులై పలు సినిమాలను మండలంలోని ఆత్రేయపురం ర్యాలీ వసంతవాడ పులిదిండి అంకంపాలెం పేరవరం వద్దిపర్రు పలు చిత్రాలను ఎక్కడ చిత్రకించారు.

ప్రకటన





కీ.శే.లు పితాని భీమారావు గారు
S/o సూరన్న (లేటు)
కీ.శే.లు పితాని వెంకయమ్మ గారు
w/o పితాని భీమారావు (లేటు)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం నియోజకవర్గం ,అల్లవరం మండలం కొమరగిరిపట్నం, ఊటగుంట గ్రామ కాపురస్తులు పితాని వెంకటేశ్వర రావు తెలియజేయనది ఏమనగా..

నా తండ్రి గారైన పితాని భీమారావు గారు S/o సూరన్న గారు ది.వి. **31.12.2008,** నా తల్లి గారైన పితాని వెంకయమ్మ గారు w/o పితాని భీమారావు గారు ది.వి. **07.06.2006** న స్వర్గస్తులైన్నారు. నా తల్లిదండ్రులకు పితాని వెంకటేశ్వర రావు అను నేను వారసుడై యున్నాను. మా గ్రామమైన కొమరగిరిపట్నం గ్రామ పంచాయతీ లో నా తల్లిదండ్రుల మరణం నామోదుకాలేదు. కావున ఎవరికైనను ఏమైన అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

పితాని వెంకటేశ్వర రావు
S/O పితాని భీమారావు, డోర్ నెంబర్ 9-15
కొమరగిరిపట్నం ఊటగుంట గ్రామం
అల్లవరం మండలం. సెల్: 99893 22784

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

S.O.P. No. 8/2024

Between:

1. Madugula Appala Raju
2. Madugula Rupulamma
3. Madugula Suribabu
4. Madugula Ramesh
5. Madugula @ Kolanki Veera Venkata Naga Lakshmi

...Petitioners

AND

1. Apollo Pharmacies Limited, represented by its Head Human Resource, Sri Haneesh Mohan Nambiar, Hyderabad, Telangana State.
2. Optival Health Solutions Pvt. Ltd., represented by its Assistant Manager - Operations (Authorized signatory) D.Vivekananda Varma, Vijayawada, Krishna District. ***...Respondents***

యిందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, పై నెంబరు S.O.P. 8/2024 నందు చనిపోయిన మడుగుల దేవి గారికి Apollo Pharmacies Limited నుండి రావలసిన ప్రతిఫలము పిటిషనర్స్‌కి దాఖలు పడినవి. పిటిషనర్స్ వారసురాలు అని సక్సేషన్ సర్టిఫికెట్ మంజూరు నిమిత్తం సక్సేషన్ O.P. దాఖలు చేసియున్నారు. పై నెంబరు S.O.P. ది. 15-10-2024న వాయిదా అయి వున్నది. యింద విషయమై ఎవరికైన ఎట్టి ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు వారి ఎదుట **ది. 15-10-2024 సం॥ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల పరోక్షమున తీర్మానం జరుగును.

రాజమండ్రి
29-9-24

బి.సాయిరామ్
అడ్వకేట్, రాజమండ్రి